# కేటీఆర్ సభ సక్సెస్

## పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు

నిజాంసాగర్, అక్టోబర్ 4: బాన్సువాడ పట్టణంలో ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సభ బుధవారం నిర్వహించగా నియోజకవర్గం నలుమూలల నుంచి బీఆర్ఎస్ అభిమానులు, గులాబీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బాన్సువాడ పట్టణం ఎటుచూసినా జన సంద్రం, గులాబీ మయంగా మారిపోయింది. చిన్నా పెద్ద, ఆడామగ తేడా లేకుండా కేటీఆర్‌ను చూసేందుకు, ఆయన మాటలు వినేందుకు భారీగా తరలివచ్చారు. మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వచ్చే వాహనాలు బాన్సువాడకు ఐదు కిలోమీటర్ల దూరం వరకు బారులు తీరాయి. బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది.


మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు తరలివస్తున్న ప్రజలు


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

## మంత్రి పర్యటనకు భారీ బందోబస్తు

బాన్సువాడ, అక్టోబర్ 4 : బాన్సువాడలో మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు బుధవారం వచ్చిన నేపథ్యంలో కామారెడ్డి జిల్లా ఏఎస్పీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో భారీగా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. బాన్సువాడలో సుమారు 800 మంది సిబ్బందితో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నలుగురు డీఎస్పీలు, 12 మంది సీఐలు, 44 మంది ఎస్సైలతోపాటు ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, సివిల్ కానిస్టేబుళ్లు, ఏఆర్ పోలీసులు విధులు నిర్వహించారు. బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

### ఎటు చూసినా జన సంద్రమే..



బాన్సువాడలో కేటీఆర్ సార్ మీటింగ్‌కు వచ్చినం. అబ్బో ఎటూ చూసినా జనమే. కేటీఆర్ సార్ మంచిగా మా ట్లాడిండు. బాన్సువాడ పట్టణం స్పీకర్ సార్ హయాంలో ఎంతో అభివృద్ధి చెందింది. నియోజకవర్గంలోని ఏ ఊరు చూసినా, ఏ వాడ చూసినా రహదారులు, డబుల్ బెడ్ రూం ఇండ్లు, మురికి కాలువలు ఒక్కటి రెండు కాదు అన్ని పనులు పూర్తిచేసిండు.

*- గంగాధర్, హంగర్గ*

### భరోసా కల్పిస్తున్నారు..



సీఎం కేసీఆర్ సార్ మహిళలకు భరోసా అయ్యారని అందుకే ఈ రోజు మా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చింద్రు. బాన్సువాడల కేటీఆర్ సభకు ఇంత భారీగా జనం తరలివచ్చారంటే ఇతర పార్టీల నాయకులకు వణుకు పుడుతుంది. ఈ జనం చూసి అల్రాడీ అర్థం అయిపోయిందనుకుంటా.

*- పోచమ్మ, మల్లాపూర్*

### చాలా మందిమి వచ్చినం..



కేటీఆర్ సభకు మా మండలం నుంచి చాలా మంది వచ్చినం. మూడు కిలో మీటర్ల దూరంలోనే ట్రాఫిక్ జామ్ అయినప్పటికీ సార్ మీటింగ్ చూడాలనే ఆశతో నడుచుకుంటూ వచ్చినం. నేను చాలా మంది నాయకుల సమావేశాలకు వెళ్లినా కానీ ఈ రోజు వచ్చినంత జనం ఎన్నడూ సూడలేదు. మళ్లీ కేసీఆర్ సార్ ప్రభుత్వమే వస్తుంది.

*- పుష్పలత, బీర్కూర్*

### మళ్లీ పోచారమే ఎమ్మెల్యే..



మళ్లీ పోచారం సారే మా ఎమ్మెల్యే. ఇంత అభివృద్ధి ఏ నియోజకవర్గంలో జరగలేదు. మా నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరిగింది. అందుకే ఈ రోజు స్వచ్ఛందంగా కేటీఆర్ సభకు ఇంత జనం తరలివచ్చారు. ఇంత జనాన్ని చూసి చాలా సంతోషంగా అనిపిస్తుంది. కచ్చితంగా బాన్సువాడ బాద్‌షా పోచారం, ముఖ్య మంత్రి కేసీఆర్ సారే.

*- గంగాధర్, చిక్కడపల్లి*

## బాధితులకు అండగా రాష్ట్రప్రభుత్వం


చెక్కును అందజేస్తున్న జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 4: రాష్ట్రప్రభుత్వం బాధితులకు అండగా నిలుస్తున్నదని నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి అన్నారు. మాల్తుమ్మెద గ్రామానికి చెందిన మహ్మద్ హుస్సేన్‌కు రూ.12వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్నదన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జాజాల సురేందర్, ఎంపీ బీబీ పాటిల్, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డికి బాధితుడు మహ్మద్‌హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు.

## తపాలా ఉద్యోగుల సమ్మె


ఎల్లారెడ్డిలో సమ్మె చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

ఎల్లారెడ్డి/ పిట్లం, అక్టోబర్ 4: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎల్లారెడ్డిలోని తపాలా ఉద్యోగులు బుధవారం ఒకరోజు సమ్మెలో పాల్గొన్నారు. ఎనిమిది గంటల పని, పింఛన్‌తోపాటు ఇతర ప్రయోజనాలు సమకూర్చాలని డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సురెన్స్, గ్రాట్యుటీని రూ.ఐదు లక్షలకు పెంచాలని కోరారు. పెయిడ్ లీవులు 180వరకు నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలని, జీడీఎస్, వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. కమలేశ్ చంద్ర కమిటీ సిఫార్సు చేసిన బెంచింగ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో పర్స పరందాములు, మామిడి రవీందర్, శరత్, ఆయా గ్రామాల బీపీఎంలు పాల్గొన్నారు.

పిట్లం మండలకేంద్రంలోని పోస్టల్ కార్యాలయం వద్ద పలు గ్రామాల బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు ఒక్క రోజు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ పోస్టుమాస్టర్ శేఖర్‌గౌడ్ ఆయా గ్రామాల పోస్ట్‌మాస్టర్లు పాల్గొన్నారు.

## వైకుంఠధామాన్ని ఆహ్లాదకరంగా ఉంచాలి

ఎల్లారెడ్డి, అక్టోబర్ 04: వైకుంఠధామం పరిసరాలను ఆహ్లాదకరంగా ఉంచాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు అన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని చీనూర్ గ్రామ వైకుంఠధామంలో మొక్కలు నాటే పనులను ఆయన బుధవారం పరిశీలించారు. వైకుంఠధామంలోని వాతావరణం బాధలను మరిచిపోయేలా ఉండాలన్నారు. మొక్కలను పెంచి వాతావరణాన్ని పచ్చగా మార్చాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

## నిజాంసాగర్ గిర్దావర్‌గా అంజయ్య



నిజాంసాగర్, అక్టోబర్ 4: నిజాంసాగర్ గిర్దావర్ (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్)గా సీహెచ్ అంజయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దకొడప్‌గల్‌లో విధులు నిర్వహించిన ఆయన నిజాంసాగర్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ కొన్ని రోజులుగా గిర్దావర్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఆయనను ఇక్కడికి బదిలీ చేశారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఆశాజనకంగా పత్తి


రైతులు సాగుచేస్తున్న పత్తి

డొంగ్లీ, అక్టోబర్ 4: మండలంలో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పత్తిని సాగుచేస్తున్నారు. నల్ల రేగడి భూమి కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పంట అంత ఏపుగా పెరుగలేదు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రస్తుతం పత్తి ఆశా జనకంగా ఉన్నదని రైతులు అంటున్నారు. పత్తికి డిమాండ్ బాగా ఉండడంతో రైతులు ఈ పంటను సాగుచేయడానికి ఆసక్తిని చూపుతున్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిజాంసాగర్, అక్టోబర్ 4: మహ్మద్‌నగర్ మండలంలోని బుర్గుల్ గ్రామంలో ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను బీఆర్ఎస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆడబిడ్డల పెండ్లి కోసం తల్లిదండ్రులు అప్పులు చేయొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అఫ్జల్, మనీష్‌రెడ్డి, జీవన్, రాములు, సాయిలు, సాయాగౌడ్, రాజా, శివాజీ, గొల్ల ఆంజనేయులు, శంకర్, సాయిరాం, బలరాం తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన




మద్నూర్, అక్టోబర్ 4: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య బోధకుడు దస్తీరాం మాట్లాడుతూ.. దోమలు వృద్ధి చెందకుండా, కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు నాగార్జున, ఉమాదేవి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# నాసిరకం విత్తనాలతో నష్టపోయిన రైతన్న

- పూత, కాతలేని రాయల్ మక్కజొన్న రకం
- దుకాణం ఎదుట రైతుల ఆందోళన


పూత, కాత లేని మక్కజొన్న పంట

సదాశివనగర్, అక్టోబర్ 4: తమ కంపెనీ విత్తనాలను సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందని డీలర్ మాటలు నమ్మి రైతులు మోసపోయిన ఘటన సదాశివనగర్, గాంధారి, తాడ్వాయి మండలాల్లో చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తునూరులోని జై శ్రీరాం సీడ్స్, ఫెర్టిలైజర్స్ దుకాణం డీలర్ రైతులకు అయాన్ కంపెనీకి చెందిన రాయల్(ఏఎస్ 3689) రకం విత్తనాలను ప్యాకెట్‌ను రూ.1400 చొప్పున విక్రయించాడు. సదాశివనగర్‌లోని ఉత్తునూరులో 300 ఎకరాలు, గాంధారి, తాడ్వాయి మండలాల్లో 200 ఎకరాల్లో రైతులు ఈ రకం విత్తనాలను సాగుచేశారు. ఇప్పటికే రూ.20వేల వరకు ఎకరానికి ఖర్చు చేశారు. అయినా పూత, కాత లేక పోవడంతో తాము మోసపోయామని రైతులు గ్రహించారు. దీంతో బుధవారం దుకాణం ఎదుట ఆందోళన చేపట్టారు. డీలర్.. సదరు కంపెనీ వారితో మాట్లాడాడు. రైతులకు వారి వద్దకు తీసుకెళ్తానని చెప్పాడు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. తమకు పరిహారం అందించాలని, సంబంధిత కంపెనీపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### నాసిరకం విత్తనాలు కొంపముంచాయి..



డీలర్ మాటలు విని అధిక దిగుబడి వస్తుందని వేసిన విత్తనాలు మా కొంపముంచాయి. నాసిరకం విత్తనాలను అంటగట్టిన కంపెనీతోపాటు డీలర్‌పై చర్యలు తీసుకోవాలి. ఎకరాకు రూ.20వేల వరకు ఖర్చు చేశాం.

*- అరిగె సంజీవులు, రైతు, ఉత్తునూరు*

### ఇప్పటికీ కంకి కట్టలేదు..



మక్కజొన్న ఎత్తు పెరిగినా కంకి కట్టలేదు. ఎన్ని మందులు వాడినా ఫాయిదా లేదు. నాణ్యమైన విత్తనాలు అని మాకు అంటగట్టిన డీలర్‌పై చర్యలు తీసుకొని పరిహారం అందించాలి.

*- మేకల పెద్ద గంగాధర్, రైతు, ఉత్తునూరు*